**Sakshi**

# ఏపీపీఎస్సీకి వర్సిటీ పోస్టుల భర్తీ బాధ్యత!

- విద్యాశాఖకు సీఎం చంద్రబాబు ఆదేశం
- గ్రూప్ 2 ఉద్యోగాలు కోల్పోయే వారికి సూపర్ న్యూమరరీ పోస్టులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 14 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,104 పోస్టుల భర్తీని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)కు అప్పగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యాశాఖను ఆదేశించారు. ఈ పోస్టుల భర్తీకి ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి స్క్రీనింగ్ టెస్టు ద్వారా అర్హులను ఎంపిక చేయాలని ఇంతకు ముందు భావించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు యూనివర్సిటీ ఉపకులపతుల సమావేశంలో వీసీలంతా తీర్మానం కూడా చేశారు. అయితే ఉన్నత విద్యాశాఖ ఇచ్చిన సూచనల మేరకు పోస్టుల భర్తీ పరీక్షలు నిర్వహించే శక్తిసామర్థ్యాలు ఉన్నత విద్యామండలికి లేవన్న ఉద్దేశంతో ఈ బాధ్యతను ఏపీపీఎస్సీకి అప్పగించాలని సీఎం చంద్రబాబు, మంత్రి గంటా శ్రీనివాసరావును ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఏపీపీఎస్సీకి ఈ పోస్టుల భర్తీ బాధ్యతను అప్పగించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

**సూపర్ న్యూమరరీ పోస్టులకు ఓకే**

1999 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు కూడా ఏపీపీఎస్సీ త్వరలో చర్యలు చేపట్టనుంది. అప్పటి గ్రూప్ 2 నియామకాలు నిబంధనల ప్రకారం జరగలేదని కొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో మళ్లీ మెరిట్ జాబితా రూపొందించి నియామకాలు జరపాలని న్యాయస్థానం తీర్పునిచ్చింది. తీర్పు మేరకు మళ్లీ మెరిట్ జాబితా రూపొందించగా ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న దాదాపు 200 మంది వాటిని కోల్పోయే పరిస్థితి తలెత్తింది. జాబితాను చూసి వారంతా ఏపీపీఎస్సీకి వచ్చి మొరపెట్టుకున్నారు. 16 ఏళ్ల పాటు ఉద్యోగం చేశాక ఇప్పుడు ఉద్యోగం లేదని రోడ్ల పైకి నెట్టడమేంటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో జాబితాను ఏపీపీఎస్సీ తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ వ్యవహారాన్ని ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగాలు కోల్పోయే వారికి సూపర్ న్యూమరరీ పోస్టులు కేటాయించాలని కోరారు. ప్రస్తుతం మెరిట్ జాబితా విడుదల చేసినా 200 మంది వరకు కొత్తగా ఉద్యోగాలు పొందే పరిస్థితి లేదని వివరించారు. దీంతో సూపర్ న్యూమరరీ పోస్టుల ప్రక్రియకు సీఎం సానుకూలంగా స్పందించారు. త్వరలోనే 1999 గ్రూప్ 2 అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలవనున్నామని ఏపీపీఎస్సీ చైర్మన్ పేర్కొన్నారు.

## ఏపీపీఎస్సీకి కొత్తగా ఐదుగురు సభ్యులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)లో ఖాళీగా ఉన్న స్థానాల్లో కొత్తగా ఐదుగురిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. సర్వీస్ కమిషన్‌లో చైర్మన్‌తోపాటు తొమ్మిది మంది సభ్యులుంటారు. ప్రస్తుతం చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్, సభ్యుడు సీతారామరాజు మాత్రమే ఉన్నారు. ఎనిమిది మంది సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇందులో కొన్ని అధికారిక హోదాలో భర్తీ అయ్యేవి కాగా కొన్ని నామినేటెడ్ కోటాలో నియామకమయ్యేవి. అధికారిక ఖాళీ స్థానాల్లో సభ్యుల్ని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ప్రొఫెసర్ గుర్రం సుజాత, ప్రొఫెసర్ జి.రంగ జనార్దన, కె.విజయకుమార్, ప్రొఫెసర్ కె.పద్మరాజు, రూప సభ్యులుగా నియమితులయ్యారు. ప్రొఫెసర్ గుర్రం సుజాత ప్రస్తుతం అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ లైబ్రరీ హెడ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రొఫెసర్ జి.రంగ జనార్దన అనంతపురం జేఎన్‌టీయూలో ఆచార్యుడిగా పనిచేస్తున్నారు. కె.విజయకుమార్ డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రొఫెసర్ కె.పద్మరాజు కాకినాడ జేఎన్‌టీయూలో ఆచార్యుడిగా ఉన్నారు. మరో సభ్యురాలు రూప గ్రామీణాభివృద్ధి శాఖలో అకౌంట్స్ అధికారిగా పనిచేస్తున్నారు. ఈ ఐదుగురు సభ్యుల నియామకంతో ఏపీపీఎస్సీలో సభ్యుల సంఖ్య చైర్మన్‌ను కలుపుకుని ఏడుకు చేరింది.